

విద్యుద్దీప వెలుగుల్లో యజుర్‌మందిరం

దేదీప్యమానం..

పుట్టపర్తిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా జయంత్యుత్సవాలను పురస్కరించుకుని ప్రశాంతి నిలయం రంగురంగుల విద్యుద్దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందుతోంది. ట్రస్టు వర్గాలు.. ప్రశాంతినిలయంలోని పలు భవనాలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. సత్యసాయి జయంత్యుత్సవాల మూడోరోజు బుధవారం సత్యసాయి సేవాదళ్ సదస్సులు నిర్వహించనున్నారు. ప్రశాంతి నిలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నారు.



గోపురం

అణువణువూ నిఘా..!



దొంగలు, రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల మూడోకన్ను

ఫేస్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘా

ప్రధాన కూడళ్లలో ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో 12 వేలు బిగించేందుకు సర్వే ప్రారంభం

ఇప్పటిదాకా 9వేల చోట్ల గుర్తింపు

హిందూపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అణువణువూ పోలీసులు నిఘా వేయనున్నారు. దందాలు, దౌర్జన్యాలకు పాల్పడే రౌడీషీటర్లు, లూటీచేసే దొంగలు, కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్ల వద్ద అమ్మాయిల వెంటపడే పోకిరీలు, రద్దీ ప్రాంతాల్లో జేబులు కత్తిరించే దొంగలు, మహిళల మెడలో చైన్లు లాక్కెళ్లే వారిని కట్టడి చేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమైంది. ఫేస్ రికగ్నిషన్ (ఎఫ్‌ఆర్‌సీ) పరిజ్ఞానంతో ముఖాన్ని గుర్తించే అధునాతన సీసీ కెమెరాలతో వారిపై నిఘా వేయబోతోంది. నేరస్థులను గుర్తించడమే కాకుండా విధుల్లో ఉన్న పోలీసులను అప్రమత్తం చేసే కెమెరాలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేయబోతున్నారు. ఎక్కడికక్కడ నేరస్థులు, దొంగలు, రౌడీషీటర్లను కట్టడి చేసేలా కెమెరాలు అమర్చేందుకు పోలీసు శాఖ కసరత్తు చేస్తోంది. ఆ దిశగా గత తెలుగుదేశం హయాంలో మ్యాట్రిక్స్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. కమాండ్ కంట్రోల్ రూమ్‌ద్వారా అధునాతన సీసీ కెమెరాలతో పర్యవేక్షించే విధానం అమలులోకి తేవాలని చర్యలు చేపట్టింది. ఆ తరువాత తెలుగుదేశం పార్టీ అధికారం కోల్పోయి వైసీపీ ప్రభుత్వం ఏర్పడింది. మ్యాట్రిక్స్ సంస్థతో ఒప్పందంలో తప్పులున్నాయంటూ వైసీపీ ప్రభుత్వం దానిని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, మూలన పడేసింది. తెలుగుదేశంపై అక్కసుతో ఈ నిర్ణయం తీసుకుందన్నది బహిరంగ రహస్యమే. దీంతో నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, చైన్‌స్నాచింగ్‌లు, అమ్మాయిలపై వేధింపులు, హత్యలు, దౌర్జన్యాలు అధికమయ్యాయి. అసాంఘిక శక్తులు పేట్రేగాయి. సీసీ కెమెరాలు అందుబాటులో లేకపోవడంతో ఎంత పెద్ద నేరాలు జరిగినా నేరస్థులను పోలీసులు గుర్తించలేకపోయారు. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం పోలీసు శాఖను పటిష్ఠం చేసి దిశగా చర్యలు చేపడుతోంది. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించే మార్గాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ రత్న 15 రోజులుగా సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలన్న దానిపై జిల్లావ్యాప్తంగా గుర్తిస్తున్నారు. 12వేల కెమెరాలు పెట్టాలని నిర్ణయించగా.. ఇప్పటికే 9వేల చోట్ల స్థలాలు గుర్తించారు.

ముమ్మరంగా సర్వే

జిల్లాలోని ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, పెద్ద పల్లెలతో పాటు ఫ్యాక్షన్ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిసింది. ఇప్పటికే 15 రోజులుగా ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో సిబ్బంది సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో గుర్తించారు. మంగళవారం నాటికి 9వేల చోట్ల గుర్తించారు. ఈ వారంలోపు మరో 3వేల చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటుకు గుర్తించే ప్రక్రియ పూర్తవుతుందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు.

దొంగలు, రౌడీషీటర్లపై మూడోకన్ను

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రౌడీషీటర్లు, దొంగలు విరుచుకుపడ్డారు. దౌర్జన్యాలు, దందాలు, దాడులు సర్వసాధారణమయ్యాయి. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాలు పెడితే రౌడీషీటర్లు, దొంగలు ఏ క్షణంలో ఎక్కడున్నారో ఇట్టే పట్టేయవచ్చని పోలీసు శాఖ భావిస్తోంది. ఆ దిశగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో కొన్ని చోట్ల దొంగలున్నారు. వారు నివసించే ప్రాంతాల్లో పటిష్ఠంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. తద్వారా వారు ఇంటి నుంచి బయటకు వచ్చిన వెంటనే వారి కదలికలపై నిఘా వేయవచ్చు. వారు ఎవరెవరితో కలిసి తిరుగుతున్నారో సీసీ కెమెరాలో రికార్డు అవుతాయి. కళాశాలలు, బస్టాండ్లలో కొంతమంది దొంగలు.. ప్రజలు జేబులు కత్తిరిస్తుంటారు. మహిళల మెడలో బంగారు లాక్కెళ్లడంతోపాటు బ్యాంకుల వద్ద డబ్బు కొట్టేస్తుంటారు. వీటికి కూడా చెక్‌పెట్టే ఆస్కారం ఉంటుంది. ఇటీవల అతివేగంతో వాహనాలు నడపడం, ఎదురుగా వచ్చే వాటిని ఢీకొట్టి తప్పించుకుపోతున్నారు. తద్వారా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది పోలీసులకు తలనొప్పిగా మారుతోంది. సీసీ కెమెరాలు ఏర్పాటుచేస్తే వీటికి చెక్ పెట్టవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

అధునాతన టెక్నాలజీ

పట్నం, పల్లె తేడాలేకుండా జనసామర్థ్యం అధికంగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసు శాఖ సన్నద్ధం అవుతుంది. ముఖ్యంగా పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో ఇటీవల సాగుతున్న దందాలకు చెక్ పెట్టవచ్చు. కొన్నిచోట్ల భద్రత, విధుల్లో ఉన్న పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారు. అలాంటి వారిని కెమెరాల ద్వారా కనిపెట్టవచ్చు. రోడ్లు, ఇళ్లు, కార్యాలయాల వద్ద జన సామర్థ్యాన్ని రికార్డు చేసేందుకు సాధారణంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తుంటాం. అలాంటివాటినే గతంలో పోలీసుశాఖ వినియోగించింది. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు శాఖ మరో అడుగు ముందుకేసి, సీసీ కెమెరాలో రికార్డు అయి స్పష్టంగా కనిపించేలా అధునాతన కెమెరాలు ఏర్పాటు చేస్తోంది.

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం

వేల సంఖ్యలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. ప్రభుత్వం నుంచి ఎంత మొత్తం విడుదలవుతుందో, ఎన్ని కెమెరాలు ఇస్తారో చూసుకుని ప్రైవేటు భాగస్వామ్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టాలని ఆలోచనలో ఉంది. పరిశ్రమలు, కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యంతో కలిసి వీటిని ఏర్పాటు చేస్తే బాగుంటుందని ఆలోచిస్తున్నారు. కొంతమంది దాతలు కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. షాపులు, ఇతరత్రా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలవద్ద సంబంధిత యజమానులే సొంతంగా ఏర్పాటు చేసుకునేలా పోలీసులు ఒప్పిస్తున్నారు. జిల్లాలో పోలీసు శాఖ భావించినట్లు అన్ని కెమెరాలు ఏర్పాటుచేస్తే నేరాలకు దాదాపుగా చెక్‌పెట్టే ఆస్కారం ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

నేరాలకు అడ్డుకట్ట వేయచ్చు: రత్న, ఎస్పీ

జిల్లావ్యాప్తంగా 12వేల సీసీ కెమెరాలు పెట్టాలని నిర్ణయించాం. సర్వే కూడా చేపడుతున్నాం. ఇప్పటివరకు 9వేల చోట్ల కెమెరాలు పెట్టేందుకు స్థలాలు గుర్తించాం. ఇప్పటికే ఐదు వేల కెమెరాలు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. మిగిలిన 7వేల కెమెరాలు ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నాం. పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలు ఏర్పాటైతే అసాంఘిక కార్యకలాపాలకు కూడా అడ్డుకట్ట వేయవచ్చు. విధుల్లో ఉన్న సిబ్బంది నిర్లక్ష్యం వీడతారు.

వడెర్లను ఎస్టీ జాబితాలో చేర్చండి

వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించండి

అసెంబ్లీలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్షలాది జనాభా ఉన్న వడ్డెర్లను ఎస్టీ జాబితాలోకి చేర్చేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శాసనసభలో ప్రస్తావించారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో వడ్డెర్ల ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే ప్రస్తావించారు. 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వడ్డెర్లను ఎస్టీజాబితాలోకి చేర్చే దిశగా అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వడ్డెర్ల చిరకాల స్వప్నాన్ని పక్కన పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దరిమిలా రానున్న పార్లమెంటు సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందేలా ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు, వడ్డెర్ల హక్కుల కోసం పోరాడిన వీరుడు వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్రపండుగగా గుర్తించి, ప్రభుత్వం నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు వడ్డెర్లు పనిచేసే క్వారీల్లో వారికి 25 శాతం కేటాయించాలని ఎమ్మెల్యే.. ప్రభుత్వం దృష్టికి తెసుకెళ్లారు. రాజకీయంగా, సామాజికంగా వెనుకబడిన వడ్డెర కులస్థులను అన్ని విధాలా ఆదుకునేందుకు వడ్డెర కార్పొరేషన్‌కు అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు.

చెరువులు నింపే పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

వెనుకబడిన పుట్టపర్తి నియోజకవర్గంలో 195 చెరువులను హంద్రీనీవా నీటితో నింపే ప్రాజెక్టు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి.. శాసనసభలో ప్రస్తావించారు. 2018లో జీఓ నంబరు 201 ద్వారా నియోజకవర్గంలోని ఆరు మండలాలకు హంద్రీనీవా కాలువ ద్వారా నీరందించడానికి డీపీఆర్ తయారీకి రూ.3.34 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు మరుగున పడిందన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తిచేస్తే 10వేల ఎకరాలకు సాగునీరు, 2.34 లక్షల మందికి తాగునీరు లభిస్తుందని సంబంధిత మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లారు.

మహిళాశక్తి అనన్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ సూర్యపల్లి నంద

- దేశాన్ని మార్చగల సామర్థ్యం అతివల సొంతం
- తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద
- ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

6

ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ. 87.14 లక్షలు



కదిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ హుండీలను మంగళవారం లెక్కించారు. హుండీల ద్వారా 67రోజులకుగాను రూ.87.14 లక్షల ఆదాయం సమకూరింది. బంగారం 57 గ్రాములు, వెండి 352 గ్రాములు వచ్చింది. విదేశీ కరెన్సీ అమెరికన్ డాలర్లు 606, 300 దినార్లు, 20 కెనడా రూబీస్, 50 నేపాల్ రూపాయలు, 1/4 కువైట్ దినార్లు వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి రవీంద్రరాజు, కెనరాబ్యాంకు మేనేజర్ అనంతబాబు, సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు



అమర్‌నాథ్‌రెడ్డి ఇంటికి నోటీసు అతికిస్తున్న పోలీసులు

- అమర్‌నాథ్‌రెడ్డిపై మూడోది..
- ఇంటికి నోటీసులు అతికించిన
- పెదనందిపాడు పోలీసులు

7

వైసీపీలో భగ్గుమన్న విభేదాలు



గోరంట్లలో ముగ్గురు నాయకుల సస్పెన్షన్

గుర్రుగా శంకర్‌నారాయణ వర్గం

సోషల్ మీడియా వేదికగా తీవ్ర విమర్శలు

గోరంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల వైసీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ మంత్రి మాలగుండ్ల శంకర్‌నారాయణ, వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ వర్గాల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి. మండలంలోని వైసీపీ నాయకులు పాటూరి శంకర్‌రెడ్డి, నాగేనాయక్, కుటాల బాబును అధిష్టానం పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మాలగుండ్ల శంకర్‌నారాయణ, ఉషశ్రీ వర్గాల మధ్య నిప్పు రాజేసింది. ఇరువర్గాల నాయకులు సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ పోస్టింగులు పెట్టారు. గోరంట్లలో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వార్ నడుస్తున్న విషయం విదితమే. పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ఇరువురిని కలిసి పని చేయాలని స్వయంగా ఆదేశించినా ప్రయోజనం లేదు. మండలంలోని బూదిలివాండ్లపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రంగప్ప ఇంటిపై వైసీపీ నాయకుడు, వానవోలు ఉపసర్పంచ్ కుటాల బాబు.. అనుచరులతో వెళ్లి దాడి చేయడమే కాకుండా విధ్వంసం సృష్టించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కొన్నిరోజులక్రితం శంకర్‌నారాయణ.. పార్టీ నాయకులను వెంటబెట్టుకుని గోరంట్ల పోలీసు స్టేషన్‌కు వచ్చి నిందితులను బెయిల్‌పై తీసుకెళ్లారు. దీంతో ఉషశ్రీ వర్గం సమావేశమై పార్టీ కోసం పనిచేస్తే సహకరిస్తామనీ, గ్రూపు రాజకీయలు చేస్తూ తమ మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే సహించేదిలేదంటూ శంకర్‌నారాయణను హెచ్చరించింది. వెన్నుపోటు రాజకీయాలు చేయడనికి మళ్లీ గోరంట్లకు వస్తే అడ్డుకుంటామని హెచ్చరించింది. ప్రత్యర్థి వర్గం వెంటనే ప్రతిస్పందిస్తూ శంకర్‌నారాయణను అడ్డుకుంటే తాము ఉషశ్రీని అడ్డుకుంటామని సవాల్ విసిరారు. ఈ నేపథ్యంలో మండలానికి చెందిన వైసీపీ నాయకులు సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు కాటూరి శంకర్‌రెడ్డి, గోరంట్ల సర్పంచ్ సరోజ భర్త నాగేనాయక్, వానవోలు ఉపసర్పంచ్ కుటాల బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వైసీపీ కేంద్ర కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దీనిని పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా మంగళవారం బహిర్గతం చేశారు. దీంతో ఇరువర్గాల వారు సోషల్ మీడియా వేదికగా విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకున్నారు. రాజకీయ నియంతకు మరో రూపం ఉషశ్రీ అనీ, పెనుకొండ నియోజకవర్గంలో నియంత రాజకీయాలకు అంకురార్పణ చేశారని నాగేనాయక్ విమర్శించారు. అధికారంలో ఉంటూ కళ్యాణదుర్గంలో సొంత పార్టీవారిపై అక్రమ కేసులు పెట్టించారనీ, ప్రస్తుతం అధికారంలేక బిక్కుబిక్కుమంటున్న తరుణంలో పెనుకొండలో సొంత పార్టీవారిని సస్పెండ్ చేయించారన్నారు. మొన్న కళ్యాణదుర్గం, నిన్న పెనుకొండను నాశనం చేశారనీ, జిల్లా మొత్తాన్ని భ్రష్టు పట్టించేదాకా వదలకంటూ ఉషశ్రీపై విమర్శలు గుప్పించాడు. ఆమెను తరిమికొట్టే రోజు ఎంతో దూరంలో లేదని మండిపడ్డాడు. ఈ నేపథ్యంలో సస్పెండైన నాయకులు బుధవారం మీడియా సమావేశం ఏర్పాటు చేస్తుండడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సమావేశానికి ఎవరూ వెళ్లవద్దంటూ ఉషశ్రీ వర్గీయులు.. ఇప్పటికే కార్యకర్తలను హెచ్చరిస్తున్నట్లు తెలిసింది.

వైసీపీ నాయకుడిపై వేధింపుల కేసు

కదిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 31వ వార్డు కౌన్సిలర్ బీబీజాన్ కుమారుడు, వైసీపీ నాయకుడు ఎస్‌కే వలిపై మంగళవారు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి ప్రకటనలో తెలిపారు. ఎస్‌కే వలి పట్టణానికి చెందిన ఓ ఒంటరి మహిళను వేధిస్తున్నాడన్నారు. అర్ధరాత్రుల్లో ఫోన్ చేస్తూ, మహిళ ఇంటి వద్దకెళ్లి అసభ్యంగా మాట్లాడుతూ వేధింపులకు పాల్పడేవాడన్నారు. ఈనెల 14వ తేదీన కోరిక తీర్చాలని ఆమెను కోరాడు. దీనికి నిరాకరించిన మహిళపై బజారులోనే దాడి చేశాడు. ఈనెల 18వ తేదీన మరికొంతమందితో కలిసి ఎస్‌కే వలి.. అమె ఇంటి వద్దకెళ్లాడు. ఆ సమయంలో అమె ఇంటి వద్ద లేదు. ఆమెను చంపేస్తానని పక్కింటి వారితో చెప్పి బెదిరించాడు. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. అమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మహిళాశక్తి అనన్యం

తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద

ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

దేశాన్ని మార్చగల సామర్థ్యం అతివల సొంతం



మహిళా దినోత్సవానికి హాజరైన భక్తులు

పుట్టపర్తి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహిళాశక్తి అనన్యమని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద అన్నారు. సత్యసాయి జయంత్యుత్సవాల రెండోరోజు మంగళవారం మహిళా దినోత్సవాలను ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అట్టహాసంగా నిర్వహించారు. అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు మంగళవాయిద్యాలు, బ్యాండ్ మేళంతో పూర్ణకుంభాన్ని సాయికుల్వంత్ మందిరానికి తీసుకొచ్చారు. హైకోర్టు జడ్జి జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులు వేదపఠనం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు జడ్జి ప్రసంగిస్తూ.. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు తదితర సేవలు వెలకట్టలేనివన్నారు. ఆధ్యాత్మిక విద్య, బోధనలు మానవాళిని శాంతి జీవనం వైపు ప్రయాణించేలా చేస్తున్నాయన్నారు. వేలాది మంది మహిళలు ఆధ్యాత్మిక, విలువలతో కూడిన విద్యను బోధిస్తుండడం హర్షణీయమన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర చాలా విశిష్టమైనదన్నారు. దేశాన్ని మార్చగల శక్తి మహిళకు ఉందన్నారు. ఎందరో మహిళలు దేశంలో ఉన్నత పదవులు అధిరోహించారనీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆ కోవలోకి వస్తారన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

ప్రపంచ దేశాలకు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు భక్తిగీతాలు ఆలపించారు. జడ్జిని ట్రస్టు ప్రతినిధులు సన్మానించారు. సాయంత్రం ప్రియా సిస్టర్స్ సంగీత కచేరి నిర్వహించారు. హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు సాయి అమృతధార చరిత పేరిట ప్రదర్శించిన నాటిక భక్తులను అలరించింది. వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు నాగానంద, సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యసాయి మహా సమాధికి నమస్కరిస్తున్న జస్టిస్ నంద



జస్టిస్ సూర్యపల్లి నందకు స్వాగతం పలుకుతున్న రత్నాకర్



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు



పూర్ణకుంభంతో ర్యాలీగా వస్తున్న విద్యార్థినులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదన వల్ల వినియోగదారులపై రూ.11,820 కోట్ల భారం పడుతోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్‌పై ప్రతి నెలా యూనిట్‌కు అదనంగా 50 పైసల నుంచి రూ.2.50 పైసల వరకు భారం పడుతోందన్నారు. విద్యుత్ భారాలు వేయబోమని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీకి విరుద్ధంగా భారాలు మోపడం సరికాదన్నారు. విద్యుత్ కంపెనీలు చేసిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించిన స్మార్ట్ మీటర్లను విమర్శించిన అప్పటి ప్రతిపక్షంలోని టీడీపీ కూటమి నేతలు నేడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు.

డిసెంబరు 23, 24 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

డిసెంబరు 23, 24వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ వెల్లడించారు. మహాసభల్లో భాగంగా రానున్న మూడు సంవత్సరాల్లో చేపట్టాల్సిన కర్తవ్యాలను నిర్ణయిస్తామన్నారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మహాసభల జయప్రదానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, రామిరెడ్డి, రామాంజనేయులు, నాగమణి, నిర్మల, జగన్, అచ్యుత్, మల్లికార్జున, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, వెంకటనారాయణ, గోపాల్, ముత్తుజ, ఇర్ఫాన్, చంద్రిక, పరమేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కౌలు గుర్తింపు కార్డు పొందిన ప్రతి రైతూ బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కృషిభవన్ నందు కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులు సమీప బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు అన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ విషయాన్ని కౌలు రైతులకు వివరించి రుణాలు పొందేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరం రబీసీజన్ నుంచి ప్రతి రైతు తమ పంటల బీమా పథకం కోసం డిసెంబరు-15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదును బట్టి నష్టం వాటిల్లిన సందర్భాల్లో పరిహారం వర్తిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులు అర్హులే అన్నారు. రైతులు బ్యాంకుల్లో రూ.20 ప్రధానమంత్రి సురక్షకు, రూ.440 ప్రధాన మంత్రి జీవనజ్యోతికి డబ్బులు చెల్లించి బీమాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రవి, ఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత స్థానాలకు పంపండి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీఓ నేతలు, ఆరోగ్య కార్యకర్తలు

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళా ఆరోగ్యకార్యకర్తలను వారి సొంత స్థానాలకు పంపాలని డీఎంహెచ్ఓకు ఎన్జీఓ నాయకులు, ఆరోగ్య కార్యకర్తలు వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జీఓ నెంబరు 143 ప్రకారం మహిళా కార్యకర్తలను రీ-డిప్లాయ్‌మెంట్ పేరుతో ఇతర పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలకు బలవంతంగా పంపించారని తెలిపారు. దీంతో అనేక మంది దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై వైద్యశాఖ కమిషనర్‌ను కలవగా రీ-డిప్లాయ్‌మెంట్ ఉత్తర్వులను రద్దును చేస్తూ ఆరోగ్యకార్యకర్తలను తిరిగి సొంతస్థానాలకు పంపిస్తామని ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ యువతి అదృశ్యమైంది. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన సిరాజుద్దీన్‌కు నిషాత్ అంజుమ్, నేహా అంజుమ్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె నేహా అంజుమ్ ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. సిరాజుద్దీన్ బంధువు ఎవరో చనిపోతే నేహా అంజుమ్ మినహా కుటుంబసభ్యులంతా మంగళవారం ఉదయం 9గంటలకు మదనపల్లికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న ఆమె వారు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లకు వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శవమై కనిపించిన పోస్టుమన్



రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం పోస్టుమన్ చాకలి రామాంజనేయులు (62) అదృశ్యమైనట్లు కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళ్యాణదుర్గం మండలం హులికల్లు కొండ సమీపంలో అతడు రామాంజనేయులు వాడుతున్న ద్విచక్రవాహనం కనిపించింది. గొర్రెల కాపరులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు హులికల్లు కొండ వద్ద పరిశీలించగా రామాంజనేయులు శవం కనిపించింది. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి పోలీసులు నిర్ధారించారు. పని ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితమే భార్య మృతి చెందడంతో ఒంటరిగానే జీవిస్తున్నాడు. మృతుడికి ఉమాదేవి, మహేష్ అను పిల్లలు వున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ అక్రమార్కులపై చర్యలు

ఈఈ, డీఈఈ, ముగ్గురు జేఈల నుంచి రికవరీకి ఆదేశం.. రూ.2.52 కోట్లు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ

అనంతపురం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో సిమెంటులో అక్రమాలకు పాల్పడిన అధికారులను ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ డివిజన్ పరిధిలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి ఆ శాఖకు చెందిన ఐదుగురు ఉద్యోగులను బాధ్యుల్ని చేస్తూ ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. 2021-22లో రూ. 2.52 కోట్లు విలువ చేసే సిమెంటును ఈఈ, డీఈఈతో మరో ముగ్గురు జేఈలు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లోనే గుర్తించారు. ఈఈని మినహాయించి మిగిలిన అధికారులను సస్పెండ్ చేశారు. తాజాగా పెనుకొండ డివిజన్ పీఆర్‌ఐ ఈఈ గోపాల్‌రెడ్డి (రిటైర్డు), మడకశిర అప్పటి డీఈఈ మల్లికార్జున, జేఈ పీఎస్‌ఎస్ రవికుమార్, గుడిబండ జేఈ కె.మద్దిలేటి, అగళి జేఈ బి. నాగన్నపై తాజాగా చార్జెస్ ఫ్రేమ్ చేశారు. దీంతో ఆ శాఖ ఉద్యోగుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలజడి రేపింది. దుర్వినియోగమైన రూ. 2.52 కోట్లు నగదును ఆయా ఉద్యోగుల్ని నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఐదుగురు ఉద్యోగుల్లో ఈఈ గోపాల్‌రెడ్డి రిటైర్డ్ అయ్యారు. మిగిలిన డీఈఈ, ముగ్గురు జేఈలు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఇతర నియోజక వర్గాల్లో జరిగిన సిమెంట్ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది.

సీపీఐ మహిళా సమాఖ్య నేత మృతి

పార్టీ శ్రేణుల దిగ్భ్రాంతి.. నేడు మెడికల్ కళాశాలకు భౌతిక కాయం



శకుంతలమ్మ (ఫైల్)

అనంతపురం విద్య/కల్చరల్/అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకురాలు, మహిళా సమాఖ్య నేత శకుంతలమ్మ (66) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఒక వైపు వృద్ధాప్యం, మరోవైపు అనార్యోగంతో బాధపడుతున్న ఆమెను కుటుంబికులు నాలుగు రోజుల కిందట సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించారు. శంకుంతలమ్మ గతంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలిగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర నాయకురాలిగా పనిచేశారు. పార్టీకి, అనుబంధ సంఘాలకు ఎంతగానో సేవలు అందించారు. గత కొన్నేళ్ల కిందట ఆమెకు బైపాస్ సర్జరీ చేయించారు. నాలుగు రోజులు కిందట ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో... ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి వైద్య సేవలు అందించారు. మధ్యాహ్నం తర్వాత ఆమె తుది శ్వాస విడిచారు. సీపీఐ, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య నేతలు ఆమె మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. బుధవారం ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు వైద్య విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలకు అందించనున్నారు. శకుంతలమ్మ మృతి చెందడం బాధాకరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, మహిళా సమాఖ్య నేతగా ఆమె ఎంతగానో సేవలు అందించారన్నారు. శకుంతలమ్మ పోరాటాలు ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మహిళలు రాజకీయాల్లో రావాలంటే భయపడే రోజుల్లోనే ఆమె కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో కొనియాడారు. ఆమె మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడం గొప్ప నిర్ణయమన్నారు.

రేపు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బోటనీ, జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటి భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అర్హులన్నారు. అసక్తి గలవారు ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐలు

లేపాక్షి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని మంగళవారం హిందూపురం రూరల్ పోలీసులు మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపాన అరెస్టు చేశారు. హిందూపురం అర్బన్, రూరల్ సీఐలు ఆంజనేయులు, జనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోళసముద్రం సమీపంలోని హెరిటేజ్ డెయిరీ వద్ద ఏపుగా పెరిగిన చెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం దాడులు చేసి, ఆరుగురిని పట్టుకున్నారు. పరిగి మండలం సేవామందిరానికి చెందిన సయ్యద్ బషీర్‌అలీ, హిందూపురం రైల్వేరోడ్డు నివాసి వంశీకృష్ణ, రహమత్‌పురం ప్రాంతానికి చెందిన ఉదయ్‌కర్ణ, అహ్మద్‌నగర్ వాసి సైపుల్లాఖాన్, లేపాక్షి మండలం పి.కొత్తపల్లికి చెందిన సయ్యద్ అమీర్, హిందూపురం మండలం మరువపల్లికి చెందిన పూరింటి తిమ్మప్ప పట్టుబడిన వారిలో ఉన్నారు. వారి నుంచి 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో హిందూపురం వన్‌టౌన్ ఎస్‌ఐ శ్రీధర్, లేపాక్షి ఎస్‌ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య ఉద్యమం

● నేడు, రేపు జీపు జాతా ● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర



మహాధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతాంగం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు రైతులు, కార్మికులు, ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగానికి ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని పేర్కొన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ చలో కలెక్టరేట్ చేపడుతున్నామన్నారు. చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, భాస్కర్, జగన్మోహన్‌రెడ్డి, వెంకటనారాయణ, అచ్యుత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు



డీఈఓను కలిసిన గంధం శ్రీనివాసులు

అనంతపురం విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) నూతన కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు నియమితుడయ్యారు. ఈ మేరకు అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి, డీసీఈబీ చైర్మన్ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాసులు కళ్యాణదుర్గం కేసీ గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొత్తగా నియమితులైన శ్రీనివాసులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమాలతో పురుషోత్తం వెనక్కు..

గత రెండేళ్లలో డీసీఈబీలో అనేక అక్రమాలు చేశారు. ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా, టెండర్లు.. ఇలా ప్రతి అంశంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2022-20 23, 2024-25 విద్యా సంవత్సరాల్లో జరిగిన అనేక గోల్‌మాల్ వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా కలెక్టర్, కడప ఆర్జేడీ వేర్వేరుగా విచారణకు ఆదేశించారు. విచారణ తర్వాత గత నెల 30న డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబుపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఫ్రేం చేయాలని ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా పురుషోత్తంబాబును డీసీఈబీ కార్యదర్శి పోస్టు నుంచి తప్పించాలంటూ జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులును నియమించారు. డీసీఈబీ కార్యదర్శి బాధ్యతలను శ్రీనివాసులకు అప్పగించాలని పురుషోత్తం బాబును ఆదేశించారు.

నేటి నుంచి పెయ్య దూడలకు టీకాలు

అనంతపురం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనంత ఉమ్మడి జిల్లాలోని 4 నుంచి 8 మాసాల వయస్సు కలిగిన పెయ్య దూడలకు బుధవారం నుంచి ఉచిత బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 19వరకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 13,800 పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలను వేయాలని నిర్ణయించామన్నారు.

అనంత జిల్లాకు 6,060 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాకు 6,750 డోసుల టీకాలు సరఫరా చేశామన్నారు. పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు, చూడి నిలవకపోవడం బ్రూసెల్లోసిస్ వ్యాధి లక్షణాలన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవ సాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 37,760 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 65టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ప్రస్తుతం 1090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు వస్తున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1090 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 993 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.593 టీఎంసీల నీరు నిల్వ వుందని అధికారులు తెలిపారు.

25 నుంచి బధిరుల క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బధిరుల అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ-20 చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా బధిరుల క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తెలిపారు. 25 నుంచి 28వతేదీ వరకు ఆర్డీటీ స్టేడియంలో నాలుగు రోజుల పాటు సాగే పోటీలకు దేశవ్యాప్తంగా సుమారు 15 జట్లు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9493362154ను సంప్రదించాలని కోరారు.

క్రైంకార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


సుధాకర్‌రెడ్డి (ఫైల్)

నల్లమాడ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన రైతు సుధాకర్ రెడ్డి (48) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తండ్రి పెద్దగంగిరెడ్డి.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. సుధాకర్‌రెడ్డికి 15 ఎకరాల పొలం ఉంది. పదెకరాల్లో మామిడి చెట్లు పెట్టాడు. మిగతా భూమిలో వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తుండేవాడు. అతివృష్టి, అనావృష్టి పంటలు దక్కక నష్టపోయాడు. అప్పులపాలయ్యాడు. దీనికితోడు తల్లి అనారోగ్యం బారిన పడడంతో వైద్యం చేయించేందుకు మరిన్ని అప్పులు చేశాడు. మొత్తంగా అప్పులు రూ.20 లక్షల వరకు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. వాటిని ఎలా తీర్చాలోనని సుధాకర్ రెడ్డి ఆవేదన చెందుతుండేవాడు. ఈనేపథ్యంలోనే మనస్తాపం చెంది తన మామిడి తోటలో సోమవారం రాత్రి పంటకు కొట్టే విషద్రావకం తాగాడు. మిత్రుడికి ఫోన్ ద్వారా విషయం తెలిపాడు. అతడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. హుటాహుటిన తోటకెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్ రెడ్డిని నల్లమాడ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం కదిరికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. రైతు భార్య చాముండి 13 ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మరణించింది. అతడికి తల్లిదండ్రులు, కుమారుడు విజయసింహారెడ్డి ఉన్నారు. రైతు ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదా ప్రజాసేవలో...!

- సమాజ సేవకు శ్రమిస్తున్న బద్దేనాయక్
- ఆపన్నులు, పేదలకు ఆర్థికసాయం
- పదేళ్లలో రూ.కోటికిపైగా...
- హిందీ టీచర్‌పై సర్వత్రా ప్రశంసలు


పాళ్లూరు వెంకటంపల్లి తండాలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

> 'దేశమును ప్రేమించుమన్న
> మంచి అన్నది పెంచుమన్న
> వొట్టి మాటలు కట్టి పెట్టి
> గట్టి మేల్ తలపెట్టవోయి.'
> - గురజాడ

ఈ మాటలే స్ఫూర్తిగా సమాజసేవలో ముందుకెళ్తున్నాడు కంబదూరు మండలం పాళ్లూరు వెంకటంపల్లి తండాకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు బద్దేనాయక్. పేద కుటుంబంలో జన్మించిన ఈయన చిన్నప్పటి నుంచి కష్టాలు, కన్నీళ్ల మధ్య పెరిగాడు. పేదరికం ఎంత భయంకరంగా ఉంటుందో అనుభవించాడు. అందుకే తాను మంచి స్థితిలోకి వచ్చిన తర్వాత పేదలను ఉద్ధరించాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నాడు. ఆ క్రమంలోనే ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వాటిని చూసిన పలువురు ఆయన్ను ప్రశంసిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

పాళ్లూరు వెంకటంపల్లి తండాకు చెందిన లక్ష్మీబాయి, వెంకటానాయక్ దంపతులకు ముగ్గురు మగ సంతానం. వీరిలో ఆఖరివాడు బద్దేనాయక్. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో 1996లో ప్రభుత్వం రెండెకరాల వ్యవసాయ భూమిని ఇచ్చింది. ఆభూమిలో శ్రద్ధగా వ్యవసాయం చేస్తూ తమ పిల్లలను చదివించుకునేవారు. పంటలు బాగా పండటంతో పాటు, ఇద్దరు బిడ్డలు బాగా చదివి ప్రయోజకులయ్యారు. పెద్ద కుమారుడు తిమ్మానాయ్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుండగా రెండో కుమారుడు రమేష్ నాయక్ తల్లిదండ్రులకు తోడుగా వ్యవసాయం చేస్తున్నా డు. వ్యవసాయం లాభసాటిగా మారడంతో ప్రభుత్వం ఇచ్చిన భూమికి మరికొంత భూమిని కొనుక్కున్నారు. ఈక్రమంలోనే వారి ఆస్తి 16 ఎకరాలకు పెరిగింది. అందులో టమోటా, కర్బూజ, కళింగర, చీనీ, వేరుశనగ పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు తీస్తున్నారు.


మాస్టారు ఇచ్చిన విద్యాసామగ్రితో విద్యార్థులు

ఉద్యోగం వచ్చిన తరువాతే ముందడుగు

ఈక్రమంలోనే డీఎస్సీ-2012లో బద్దే నాయక్ గ్రేడ్-2 హిందీ పండిట్ ఉద్యోగాన్ని సాధించాడు. మొదటి పోస్టింగు శెట్టూరు మండలం కైరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో లభించింది. అక్కడి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి శిల్ప గుండె జబ్బు వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఆయన ఆ విద్యార్థికి సాయం చేయాలని అనుకున్నాడు. అదే తడవుగా విద్యార్థి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి హార్ట్ ఆపరేషన్‌కు కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. తర్వాత పాళ్లూరు వెంకటంపల్లిలో రూ. 5 లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశాడు. విద్య, వైద్యానికి సాయం చేయాలని ఎవరైనా యువకులు, గ్రామస్థులు సమాచారం అందిస్తే వెంటనే సాయం అందించాడు. సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కూడా ఎంతోమందికి ఆర్థిక సాయం అందించారు. 2015 నుంచి సేవా కార్యక్రమాల కోసం తనకు వచ్చే జీతంలో 45 శాతం వినియోగిస్తున్నాడు. వ్యవసాయంలో వచ్చే ఆదాయాన్ని కూడా సమాజ శ్రేయస్సుకు ఖర్చు చేస్తున్నాడు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి ఎంతో మందికి విద్య, వైద్య కోసం ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్నారు. సుమారు 700 మందికి పైగా రూ.కోటి వరకు ఆర్థికసాయాన్ని అందించారు. ఈయనకు 2019లో గ్రేడ్-1 స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి వచ్చింది. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

- కళ్యాణదుర్గం

మదర్‌థెరిసా ఆదర్శం



మదర్‌థెరిసా నాకు ఆదర్శం. ఎక్కడి నుంచో వచ్చి మనదేశంలో ఆమె చేసిన సేవా కార్యక్రమాలు తెలుసుకుని స్ఫూర్తి పొందా. అలాగే ఆ నలుగురు సినిమా చూసినప్పటి నుంచి మరణించాక మన వెంట వచ్చేది మనం చేసిన మంచి తప్ప ఏదీ కాదని తెలుసుకుని ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందచేస్తున్నా. నాకు వచ్చే జీతంలో 45 శాతం ఇతరుల కోసం ఖర్చు చేస్తున్నా. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటేనే మానవ జన్మకు సార్థకత.

బద్దేనాయక్, ఉపాధ్యాయుడు

మా పాఠశాల అదృష్టం



సేవా కార్యక్రమాలు చేసే ఉపాధ్యాయుడు బద్దేనాయక్ మా పాఠశాలలలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాం. మేము కూడా బద్దేనాయక్ బాటలో తోచినంత సాయం చేస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలా సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవడం గర్వించదగ్గ విషయం.

- భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు, మాకొడికి ఉన్నత పాఠశాల

స్కూల్‌లోనే స్వీపర్ పోస్టు ఇప్పించాడు



నాకు నలుగురు ఆడపిల్లలు. కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. అలాంటి సమయంలో నా కష్టాన్ని విన్న బద్దేనాయక్ సార్, కైరేవు స్కూల్లోనే స్వీపర్ పోస్టు ఇప్పించి, నెలకు రూ. 2 వేలు జీతం ఇచ్చేవాడు. ఇప్పుడు ఆ స్వీపర్ పోస్టు రెగ్యులర్ చేశారు. నా కుమార్తె పెళ్లికి కూడా రూ. 15 వేలు ఆర్థికసాయం చేశారు.

-అంజినమ్మ, కైరేవు, శెట్టూరు మండలం

మా అబ్బాయి గ్రూప్ వన్ కోచింగ్‌కు సాయం



నా భర్త ఎనిమిదేళ్ల కిందట మరణించాడు. అప్పటి నుంచి నేను కూలి పనికి వెళ్తూ నా కుమారుడిని పోషిస్తున్నా. బద్దేనాయక్ సార్ మా లాంటి పేద కుటుంబాలను ఆదుకుంటారని తెలిసి నా కొడుకు కోసం వెళ్లా. మా కుటుంబ స్థితిగతులను తెలుసుకున్న ఆయన నా కొడుకు గ్రూప్ వన్ కోచింగ్‌కు రూ. 60 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇప్పుడు మా అబ్బాయి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు.

-నాగమ్మ, మాకొడికి, శెట్టూరు మండలం

పరాజయం.. పరిపూర్ణం..!

- మూడో మ్యాచ్‌లోనూ ఓడిన ఏపీ జట్టు
- సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో ఖేల్ ఖతం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్ ఓటములతో ఆతిథ్య జట్టు ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర పరాభవం ఎదురైంది. గత ఆరు రోజులుగా స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న సంతోష్‌ట్రోఫీ-2024 ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఉదయం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నికోబర్ జట్ల మధ్య జరిగింది. మొదటి నుంచి ఎలాంటి పోరాట పటిమ ప్రదర్శించని ఏపీ జట్టు తమిళనాడుపై 8 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఆంధ్రా జట్టు హ్యాట్రిక్ ఓటమిని చవి చూసింది. తమిళనాడు ఆటగాళ్లు లిజో 4గోల్స్, నంద కుమార్ అనంతరాజ్ 2గోల్స్ చేయగా హెన్రీ జోసెఫ్ ఇమ్మానుయేల్, రీగాన్ చెరో గోల్ చేశారు. దీంతో ఆడిన మూడు మ్యాచుల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసిన తమిళనాడు గ్రూప్-జిలో ప్రథమ స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్ మధ్యాహ్నం అండమాన్ నికోబర్, కర్ణాటక జట్లు తలపడ్డాయి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టులోని ప్లేయర్లు నిఖిల్‌రాజ్ మురుగేష్‌కుమార్ 4 గోల్స్, రాయన్ విల్‌ఫ్రెడ్ 2గోల్స్ కొట్టారు. ఆండ్ర్యూ గురుంగ్, కార్తిక్ గోవిందస్వామి, సూర్య, సుజయ్, సయ్యద్ అహ్మద్‌లు చెరో గోల్ కొట్టారు. దీంతో కర్ణాటక జట్టు అండమాన్‌పై 11 గోల్స్ తేడాతో విజయాన్ని అందుకుంది. ట్రోఫీలో తమిళనాడు 9 పాయింట్లుతో ప్రథమ స్థానంలో నిలవగా, కర్ణాటక 6 పాయింట్లతో ద్వితీయ స్థానం, అండమాన్ నికోబర్ 3 పాయింట్లతో తృతీయ స్థానం, ఆంధ్రప్రదేశ్ సున్నా పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

ఓడీఎఫ్ రహిత జిల్లాగా నిలుపుదాం

- మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహిద్దాం
- కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్లను వందశాతం వినియోగించుకునేలా ప్రోత్సహిద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తూ నిధులు విడుదల చేశాయన్నారు. ప్రజలు వాటిని ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని ఆదేశాలు ఇచ్చాయని అన్నారు. అందులో భాగంగానే మనమరుగుదొడ్డి-మనగౌరవం నినాదంతో డిసెంబరు 10వరకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిచాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మతులు, కమ్యూనిటీ మరుగుదొడ్లను సుందరీకరించడం, పారిశుధ్య వీరులను గుర్తించి సన్మానించడం తదితర కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. మరుగుదొడ్ల వాడకంలో నీటి లభ్యత చాలా ముఖ్యమని, ప్రతి మరుగుదొడ్డికి నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీఓ నాగరాజు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీఐపీఆర్ఓ గురుస్వామిశెట్టి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

లాఠీపై వేటు

- అవినీతి ఆరోపణలతో వీఆర్‌కు 15 మంది
- నలుగురు ఏఎస్ఐలు, ఆరుగురు హెచ్‌సీలు, ఐదుగురు కానిస్టేబుళ్లు

అనంతపురం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు, అసాంఘిక కార్యకలాపాలకు సహకారం, డబ్బు వసూలు చేయడం లాంటి వ్యవహారాలకు పాల్పడిన పోలీసులను వీఆర్‌కు పంపారు. జిల్లాలో హెచ్చుమీరి ప్రవర్తిస్తున్న పోలీసులపై ఎస్పీ జగదీష్ దృష్టి సారించారు. ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు మచ్చ తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మందిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. వీటిలో కొన్ని శాఖ పరంగా ఆరా తీయగా, కొన్ని నేరుగా ప్రజల నుంచే ఎస్పీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. వారిపై బదిలీ వేటు ఖాయంగా కనిపిస్తోంది. అత్యధికంగా పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లు అశోక్, శ్రీనివాసరావురెడ్డి, యాడికి కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పెద్దవడుగూరు హోంగార్డు లోకేశ్వర్‌రెడ్డి, తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుళ్లు మల్లికార్జున, చాంద్‌బాషా, కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్, తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, రామాంజనేయులు, మనోహర్‌రెడ్డి, పుట్లూరు హెడ్‌కానిస్టేబుల్ నూరుల్లా, అనంతపురం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు నరసింహులు, అశోక్, కళ్యాణదుర్గం ఏఎస్ఐ రాజశేఖర్, కుందుర్పి కానిస్టేబుళ్లు సురేష్‌బాబు, రెహమాన్, బుక్కరాయసముద్రం హెడ్ కానిస్టేబుల్ జాన్సన్‌లపై వేటు పడింది. వీరిలో మంగళవారం ఎనిమిది మంది వరకు రిపోర్టు చేసుకున్నట్లు సమాచారం. తొలి జాబితాలో వచ్చిన వీరిలో ఓ ఎనిమిది మంది ప్రజలతో మర్యాద లేకుండా మాట్లాడి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. కళ్యాణదుర్గం ఏఎస్ఐ, మరికొందరు ప్రజలిచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. వీరిలో ఓ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ డ్యూటీ ఒకచోట, డీఓ మరోచోట ఉండి పనిచేస్తుండటంతో వారిని కూడా బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పుల ఒత్తిళ్లు, మానసిక ఇబ్బందులతో సిండికేట్‌నగర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రమేష్(32) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కణేకల్లు మండలం నాగేపల్లికి చెందిన రమేష్ బెంగుళూరుకు చెందిన ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం సిండికేట్‌నగర్‌లో భార్య, పిల్లలతో ఉంటూ.. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. మానసిక ఇబ్బందులు ఉండటంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నాడు. స్వగ్రామంలో ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఒత్తిడి ఎదుర్కోలేక తన ఇంట్లోనే సోమవారం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌ను వినియోగించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చదువు రానివారితోపాటు ఉన్నత విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, లక్షలు పెట్టుబడి పెడితే కోట్లు ఇస్తామని నమ్మబలకడం, వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేయడం.. ఇలా ఎన్నో రకాల మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను సెట్ చేసుకుని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే.. వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీఓవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అప్పగింత


ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను తిరిగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చెన్నేకొత్తపల్లి పోలీసులు మంగళవారం అప్పగించారు. సోమవారం రాత్రి గ్రామంలో గస్తీకి వెళ్లిన సమయంలో న్యామద్దల రోడ్డు పక్కన ఓ దుకాణం వద్ద పోలీసులకు లగేజ్ బ్యాగ్ కనిపించింది. దీంతో ఆ బ్యాగును స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీంచగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఐడీ కార్డులు ఉన్నాయి. ఐడీ కార్డు ఆధారంగా కంపెనీకి ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సూరజ్ మిశ్రా అని తెలుసుకుని సమాచారం తెలియజేశారు. దీంతో కంపెనీ నిర్వాహకులు హైదరాబాద్ నుంచి ఒక ఉద్యోగిని సీకే పల్లికి పంపించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, లగేజీ బ్యాగును అప్పగించారు.

అపార్‌పై అశ్రద్ధ తగదు: ఆర్ఐఓ


మాట్లాడుతున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అపార్‌పై అశ్రద్ధ తగదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) వెంకటరమణ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ అపార్ ఐడీలు జనరేట్ చేయడంలో ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ సెంటర్‌లో పదో తరగతి మార్కుల జాబితాల ఆధారంగా పేర్లను సరిచేసుకోవాలన్నారు. అపార్ ఐడీల నమోదులో ఎదురయ్యే సమస్యలపై పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 21వ తేదీలోగా చెల్లించాలన్నారు. 22వ తేదీ నుంచి రూ. 1000 అపరాధ రుసుంతో చెల్లించేందుకు అవకాశం ఉందని గుర్తు చేశారు. సమావేశంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసులు, సమగ్రశిక్ష అధికారి నారాయణ స్వామి, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, ప్రైవేట్, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు

పెనుకొండ రూరల్/కదిరి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన నలుగురు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు రొద్దం ఎస్ఐ నరేంద్ర మంగళవారం తెలిపారు. రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బాలాజీరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రెడ్డిపల్లి వాసి అశోక్‌రెడ్డి సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత పోస్టులు పెట్టారని ఆయన తెలిపారు. రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన పవన్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమర్‌నాథ్ రెడ్డిపై మరో కేసు

కదిరి మండలంలోని వీరచెన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమర్‌నాథ్‌రెడ్డిపై మరో కేసు నమోదైంది. గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వంపై అమర్‌నాథ్‌రెడ్డి సోషల్ మీడియాలో కించపరిచేలా పోస్టులు పెట్టినందుకు పెదనందిపాడుకు చెందిన ఐటీడీపీ కార్యకర్త ఖలీల్ ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం వీరచెన్నయ్యగారిపల్లికి వచ్చారు. అమర్‌నాథ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో అతడి ఇంటికి నోటీసులు అతికించారు. వారంలోపు స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు. కాగా, అమర్‌నాథ్‌రెడ్డిపై సోషల్ మీడియా పో స్టులకు సంబంధించి ఇదివరకే రెండు కేసులు నమోదయ్యాయి.

న్యూస్ బాక్స్

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్య

పుట్టపర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ, అభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్యకు స్థానం కల్పించారు. కూటమి ప్రభుత్వం మంగళవారం పలు రాష్ట్ర సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమించింది. యాదవ సంక్షేమ అభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ సభ్యుడిగా పెనుకొండ మండలం వెంకటగిపాళ్యం టీడీపీ నేత కేశవయ్యను నియమించారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపిక


యామిని

ధర్మవరం రూరల్, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చిగిచెర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న యామిని ఈనెల 3 నుంచి 5 వరకు నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి అనంత పురం జిల్లా జట్టు ద్వితీయస్థానం సాధించడంలో కీలకపాత్ర పోషించి రాష్ట్ర సెలక్టర్ల దృష్టిని ఆకర్షించిందని పీడీ ప్రతాప్ తెలిపారు. ఈనెల 22 నుంచి హర్యానాలో జరిగే జాతీయస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

కబడ్డీ పోటీలకు ..


ధరణి

పుట్టపర్తిరూరల్: మండలంలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో బీకాం తృతీయ సంవత్సరం చదువుతున్న ధరణి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. నవంబరు 29 నుండి డిసెంబరు 2 వరకు తమిళనాడు అళిగప్ప యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ కబడ్డీ పోటీల్లో ఎస్కే యూనివర్శిటీ తరపున పాల్గొంటుందని మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్టీ సురేష్‌కుమార్ మంగళవారం పేర్కొన్నారు. ఆమెను ట్రస్టీతోపాటు ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏఓ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పీడీ శ్రీనివాసులు అభినందించారు.

పేద కుటుంబానికి ఆర్థికసాయం

ధర్మవరం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్‌లో నివసిస్తున్న మస్తాన్‌వలీ, నస్రీన్‌ల కుమారుడు సమీర్ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాల తరపున హాకీ ఆడటానికి వెళ్లిన అతను.. తీవ్రంగా గాయపడి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విద్యార్థికి అత్యవసరంగా ఆపరేషన్ చేయించాలని వైద్యులు తెలిపారు. దీంతో ఆస్పత్రికి వెళ్లడానికి డబ్బులు లేక ఇబ్బందులు పడుతుండటంతో ఎంఎండీఏ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు రోషన్, జమీర్ తనవంతుగా రూ.10 వేలు ఆ విద్యార్థి కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. భవిష్యత్తులో కూడా వైద్యం కోసం తనవంతు సహాయసహకారాలు అంది స్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎండీఏ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ దాదాపీర్, సభ్యులు నబిజిక్రియ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

నేడు చేపల చెరువు వేలం

కదిరి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరి కుంట్లపల్లి పంచాయతీ పరిధిలోని ఉన్నమ్మచెరువు, ఆలంపూర్ చెరువుల్లో చేపల పెంపకానికి బుధవారం వేలం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి రామమోహన్ తెలిపారు. సంవత్సరం పాటు వేలం దారుల ఆధీనంలో ఈ చెరువులు ఉంటాయన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.ఐదువేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నాలని, వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు.

సర్వేయర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు


వివరాలు ఆరాతీస్తున్న జిల్లా అధికారులు

ముదిగుబ్బ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడ్డంపల్లి తండా సచివాలయం సర్వేయర్ రాజేశ్‌పై రైతులు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. గుంజెపల్లి సర్వేనెంబరు 1039-1బీ, బీ1,1ఏలో సర్వేలో రాజేష్ అవినీతికి పాల్పడ్డాడని, ప్రశ్నించిన తమను అసభ్యపదజాలంతో దూషించాడని రైతులు విశ్వనాథ్, వీరనారప్ప ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఏడీ విజయశాంతి, డీఐలు మురళి, అంజలి ముదిగుబ్బ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ బాధిత రైతులను, సర్వేయర్‌ను పిలిపించి, విచారించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. అవకతవకలు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామసభకు పది ఫిర్యాదులు

నల్లమాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో తహసీల్దార్ రంగనాయకుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈసభకు మొత్తం పది వినతులు వచ్చినట్లు ఆయన చెప్పారు ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించుకోండి

నంబులపూలకుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఈఓఆర్డీ మాధవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సచివాలంలో ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇంకా మరుగుదొడ్లు నిర్మించుకోని వారుంటే దరఖాస్తు చేసుకోవాలని, వెంటనే మరుగుదొడ్లు మంజూరుచేస్తామని అన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి రెడ్డి భాస్కర్, ప్రజలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు సక్రమంగా అందించండి

ఓబుళదేవరచెరువు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): డీలర్లు సకాలంలో లబ్ధిదారులకు నిత్యావసర వస్తువులు అందేలా చూడాలని తహసీల్దార్ అనంతాచారి, సీఎస్‌డీటీ విజయనిర్మల పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు నుంచి కందిబేడలు 70 శాతం సరఫరా అవుతాయన్నారు. డీలర్లు ముందుగా టోకన్ల సిస్టమ్ పెట్టి ముందుగా వచ్చిన వారికిచ్చే ఏర్పాటు చేయాలన్నారు. గతంలో బఫర్ స్టాక్ విషయాలను డీలర్ తీసుకె ళ్లారు. అలాగే పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో డీలర్ల సంఘం నాయకులు పిట్టా రాజారెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ

కదిరి అర్బన్: పట్టణంలోని ఎస్టీ బాలుర గురుకుల పాఠశాలను ఆర్డీఓ పీఎస్ఎస్ శర్మ మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం కుటాగుళ్ల వద్ద ఉన్న పౌరసరఫరా బియ్యం గోదామును తనిఖీ చేశారు.

ఉపాధి కూలీలు, పనిదినాలు పెంచండి

గాండ్లపెంట : మండలంలో ఉపాధి కూలీలను, పనిదినాలను పెంచాలని ఉపాధి సిబ్బందికి పీడీ విజయేంద్రప్రసాద్ సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు, పనిదినాలు పూర్తిస్థాయిలో తగ్గిపోయాయని, పనులపై అవగాహన కల్పించి కూలీలు రోజులు పెంచేలా చూడాలన్నారు.

పట్టించుకోండి సార్...!

- నిరుపయోగంగా ప్రభుత్వ పాత భవనాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం


నిరుపయోగంగా ఉన్న ఎస్టీ బాలుర వసతి గృహం

నల్లమాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నల్లమాడలో పాత తహసీల్దార్ కార్యాలయం, ఎస్టీ బాలుర వసతి గృహం భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ భవనాలు అసాంఘిక కార్యకాలాపాలకు నిలయంగా మారాయి. రాత్రి ఏడు గంటల తరువాత పలు అసాంఘిక కార్యక్రమాలు ఈ భవనాల్లో జరుగుతున్నాయి. ఆ భవనాలకు మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తేవడం.. లేక వాటిని కూల్చి ఆ స్థానాల్లో కొత్త వాటిని నిర్మించేలా అధికారులు, పాలకులు చొరవ చూపడం లేదు.

● తహసీల్దార్ కార్యాలయం

తహసీల్దార్ కార్యాలయ భవనం పెచ్చులు ఊడటం.. వర్షం వస్తే కారుతుండటంతో ఆ కార్యాలయాన్ని రెండేళ్ల క్రితం ఊరికి కిలోమీటర్ దూరంలో ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహంలోకి మార్చారు. అప్పటి నుంచి ఈ తహసీల్దార్ కార్యాలయ భవనం నిరుపయోగంగానే ఉంది. ఈ కార్యాలయ గోడలన్నీ బాగా ఉన్నాయి. కప్పు మాత్రం పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. ఈ భవనానికి పై కప్పను తొలగించి.. గోడ ఎత్తు పెంచి, టాప్ వేస్తే ఆ భవనం ఉపయోగంలోకి వస్తుంది. అయితే అలాకాకుండా ఆ భవనాన్ని కూల్చివేసి, నూతన భవనం నిర్మించాలని జిల్లా ఉన్నతాధికారులకు నాటి ఇన్‌చార్జ్ తహసీల్దార్ నివేదికలు పంపారు. ఏడాదిన్నర అయినా నూతన భవనానికి నిధులు మంజూరుకాలేదు. పాత భవనాన్ని కూల్చలేదు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం ఊరికి దూరంగా ఉండటంతో అక్కడికి ప్రజలు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. విలువైన రికార్డులన్నీ ఊరికి దూరంగా ఉన్న ఆ కార్యాలయంలోనే ఉన్నాయి. అక్కడ కనీసం సీసీ కెమెరాలు కూడా లేవు. ఏ రికార్డులు పోయినా అడిగే నాథుడే ఉండడు. పాత తహసీల్దార్ కార్యాలయ భవనానికే మరమ్మత్తులు చేసి.. దాన్ని అందుబాటులోకి తేస్తే అందరికి అందుబాటులో ఉంటుందని గ్రామస్థులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయం

● ఎస్టీ బాలుర వసతిగృహం

ఎస్టీ బాలుర వసతి గృహం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆరేళ్ల క్రితం ఆ వసతి గృహాన్ని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలోకి మార్చారు. అప్పటి నుంచి ఎస్టీ బాలుర వసతిగృహం భవనమూ నిరుపయోగంగానే ఉంది. ఈవసతి గృహంలో 12 గదులు, పది మరుగుదొడ్లు, పది స్నానపు గదులు ఉన్నాయి. మరుగుదొడ్లకు, స్నానపుగదులకు ఉన్న తలుపులను.. గదుల కిటికీలు ఎత్తుకెళ్లారు. రాత్రి సమయాలల్లో పలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

ఇలా నల్లమాడలో ఈ రెండు ప్రభుత్వ కార్యాలయ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఇపట్టికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆ భవనాలను వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి


గాండ్లపెంట ఉన్నత పాఠశాల

గాండ్లపెంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అపార్ నమోదు చేయాలని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు సూచించారు. విద్యార్థుల ఆధార్, పాఠశాల రికార్డుల్లో, జనన ధ్రువీకరణ పత్రాల్లో ఇంటిపేర్లు, పేర్లు, వయస్సు ఒకేలాగా ఉంటేనే అపార్ ఐడీ నమోదువుతోంది. ఆధార్‌లో ఇంటి పేరు, పేర్లు, వయస్సు తప్పుగా ఉండటంతో వాటిని సరి చేసుకోవడానికి పలురువు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేకపోవడంతో కదిరికి వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. అక్కడికి కూడా పలుమార్లు తిరిగినా అప్‌డేట్ కావడం లేదంటున్నారు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లగా.. సచివాలయ సిబ్బందితో ఉన్నత పాఠశాలలోనే మంగళవారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారన్నారు. అయితే మంగళవారం ఏర్పాటు చేయకపోవడంతో ఎంపీడీఓ వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాబురావు, ఎంఈఓ క్రిష్టానాయక్‌ను పలువురు తల్లిదండ్రులు ప్రశ్నించారు. ఏపీ ఆన్‌లైన్ పనిచేయలేదని చెప్పడంతో తల్లిదండ్రలు చేసేదిలేక నిరాశతో వెనుతిరిగారు.

గుండె వైద్యశిబిరం


వృద్ధుడితో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని కిమ్స్‌సవేరా ఆస్పత్రి సహకారంతో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ హాజరయ్యారు. పెద్దఎత్తున ప్రజలు ఈ శిబిరానికి తరలివచ్చి గుండె పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీచేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ. గుండె జబ్బులను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ఇందుకు ఇలాంటి ఉచిత గుండెవైద్యశిబిరాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. 198 మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించగా 11 మందికి గుండెజబ్బు ఉందని గుర్తించామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు మాధవరెడ్డి, పురుషోత్తంగౌడ్, గుడిపాటి సురేశ్‌చౌదరి, రాళ్లపల్లి షరీఫ్, గోసల శ్రీరాములు పాల్గొన్నారు.


పుట్టపర్తి : నివాళులు అర్పిస్తున్న కోటా సత్యం

ఇందిరాగాంధీకి ఘన నివాళి

పుట్టపర్తిరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం మంగళవారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● కదిరి అర్బన్: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఇందిరాగాంధీ సర్కిల్‌లో ఆమె చిత్రాపటానికి పూలమాలలు వేసి, నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు కదిరిప్ప, కేఎస్ షాన్వాజ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఏపీగా వెంకటనారాయణ



కదిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వెలుగు ఇన్‌చార్జ్ ఏరియా కో-ఆర్డినేటర్‌గా ఎన్పీకుంట ఏపీఎం వెంకటనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను తనకల్లు, గాండ్లపెంట, నల్లమాడ తదితర ప్రాంతాల్లో ఏపీఎంగా పనిచేశారు.


అక్రమ లేఅవుట్‌లో రాళ్ల తొలగింపు


అక్రమ లేఅవుట్‌లో పాతిన రాళ్లను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంబులపూలకుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక వైపు కదిరి-రాయచోటి ప్రధాన రహదారి నల్లగంగమ్మ గుడి సమీపంలో బీడు భూములు కొందరు వైసీపీ నేతలు కొనుగోలు చేశారు. అహుడా అనుమతి లేకుండా లేఅవుట్లు వేసి.. ప్లాట్లను విక్రయించారు. దీనిపై దర్జాగా కబ్జా పేరుతో ఆంధ్రజ్యోతి మంగళవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి ఈఓఆర్డీ మాధవరెడ్డి స్పందించారు. ఆ ప్రాంతానికి వెళ్లి.. ఆ లేఅవుట్‌లో పాతిన రాళ్లను కార్మికుల ద్వారా తొలగించారు. అనంతరం అక్రమ లేఅవుట్ భూ యజమానికి నోటీసులు జారీ చేశారు. ఇలాంటి లేఅవుట్లలో ప్రజలు కొనుగోలు చేయకూడదని, ఇలాంటి లేఅవుట్‌లో గృహనిర్మాణాలకు పంచాయతీవారు అనుమతులు ఇవ్వబోరని అన్నారు. ఆయన వెంట ఇన్‌ఛార్జీ కార్యదర్శి రెడ్డిభాస్కర్, కార్మికులు ఉన్నారు.

మరువ పారిన రావులచెరువు



ధర్మవరంరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులచెరువు గ్రామ చెరువు నిండి.. మరువ పారుతోంది. దీంతో రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పదిరోజుల క్రితం టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పరిటాల శ్రీరామ్ గ్రామరైతులు విజ్ఞప్తి మేరకు ప్రత్యేక చొరవ తీసుకుని ధర్మవరం చెరువు 7వ మరువ నుంచి నీరు వెళ్లేందుకు కాలువను శుభ్రం చేయించారు. అధికారులతో మాట్లాడి 7వ మరువ నుంచి గేటు ద్వారా నీటిని విడుదల చేశారు. దీంతో సుమారు 10 రోజుల పైగా నీరు రావడంతో.. ఈ చెరువు మంగళవారం నిండింది. ఫలితంగా బోరుబావుల్లో నీటి మట్టం పెరుగుతుందని రావుల చెరువు, తిప్పేపల్లి, గ్రామాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

టమోటా బీమా ప్రీమియం చెల్లించండి

ధర్మవరం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రబీలో ఉద్యాన పంటల సాగులో ప్రభుత్వం టమోటా పంటకు ఐఎఫ్ఎఫ్‌సీఓ-టీఓకేఐఓ కంపెనీ ద్వారా బీమా సదుపాయం కల్పించిందని ధర్మవరం హార్టికల్చర్ అధికారిణి అమరేశ్వరి మంగళవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. టమోటా పంటకు గరిష్ఠంగా ఎకరాకు రూ.32 వేలు బీమా వర్తిస్తుందని, దీని కొరకు ఇందులో 10 శాతం, రూ.3200 బీమా కంపెనీకి ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1600 చెల్లించగా.. రైతుల వాటా రూ.1600 చెల్లించాలన్నారు. ప్రీమియం చెల్లించేందుకు వచ్చే నెల 15 వరకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇంటి కోసం దరఖాస్తు చేసుకోండి

ధర్మవరం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇళ్లు లేని పేదలు ఇంటి కోసం ఆయా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ భార్గవి మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు భార్యభర్తల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకుఖాతా, జాబ్‌కార్డు, స్థలంకు సంబంధించి పోజిషన్ సర్టిఫికెట్, రెండు పాస్ ఫొటోలు, భార్యభర్తల గ్రూపు ఫొటో, కులం, ఆదాయం ధ్రువీకరణపత్రాలతో ఆయా గ్రామాల్లోని సచివాలయంలోని ఇంజనీర్ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం

ధర్మవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీచెన్నకేశవపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదవవీధికి చెందిన బేల్దారి గజేంద్ర (26) దుర్మరణం చెందాడు. మంగళవారం రాత్రి ఇతడు తన అక్క ఇంటికి వెళ్లడానికి బైక్‌పై బయలుదేరాడు. దేవి నర్సింగ్ హోం వద్ద రోడ్డు క్రాస్ చేస్తుండగా ధర్మవరం నుంచి పుట్టపర్తి వెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గజేంద్ర అక్కడికక్కడే మరణించాడు. గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ నాగేంద్రప్రసాద్ సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేపట్టారు. గజేంద్రకు భార్య నందిని, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

యాడికి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్య సాయి జిల్లా ధర్మవరానికి చెందిన చెండ్రాయుడు (37) అనంతపురం జిల్లా యాడికి మండలం రాయలచెరువులోని ఓ టీ హోటల్‌లో పనిచేసేవాడు. ఈనెల 14న అయ్యప్పస్వామి ఆలయానికి అతను నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ అతను మంగళవారం మరణించాడు. చెండ్రాయుడు భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ధర్మవరం నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కేతిరెడ్డికాలనీకి చెందిన వెంకటేష్ భార్య గంగాదేవి మంగళవారం ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆమె.. ఇంటిలో ఉన్న విష ద్రావకాన్ని తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

● ఇందిరమ్మకాలనీలో యువతి...

స్థానిక ఇందిరమ్మకాలనీకి చెందిన యువతి రేణుక ఆత్మహత్యకు యత్నించింది. మంగళవారం ఆమె ఇంట్లో ఉరి వేసుకొని.. ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.


జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

23 మంది ఉద్యోగాలకు ఎంపిక

బుక్కపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయ్‌మెంట్, సిడాప్ సంయుక్తంగా మంగళవారం స్థానికంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 54 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 23 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మగ్బుల్‌హుస్సేన్ తెలిపారు.

ఆమిదాలగొందిలో తాగునీటి ఎద్దడి



పగిలిన పైపులైన్ నుంచి నీటిని పట్టుకుంటున్న జనం

మడకశిర రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో గత మూడు నెలలుగా తాగునీరు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పావగడ నుంచి మడకశిరకు బీఎస్ఎన్ఎల్ వారు రోడ్డు ప్రక్కన కేబుల్ వైరు అమర్చారు. ఆ సమయంలో తాగునీటి కోసం వేసిన పైపులైన్లు పగిలిపోయాయి. మూడు నెలలు అవుతున్నా వాటికి మరమ్మతు చేయకపోవడంతో గ్రామస్థులు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. అనేక సార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడంలేదని మహిళలు వాపోతున్నారు. కొంతమంది పగిలిన పైపులైను నుంచి వచ్చే నీటిని పట్టుకుని నీటి తొట్టెలు నింపుకొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తగుచర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బస్‌స్టాప్ కోసం వినతి

సోమందేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని నక్కలగుట్ట కాలనీ వద్ద బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని స్థానికులు మంగళవారం డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నక్కలగుట్ట నుంచి సోమందేపల్లి 2కి.మి. దూరంలో ఉండటంవల్ల రాకపోకలు కొనసాగించడం ఇబ్బందిగా మారిందన్నారు. నక్కలగుట్టవద్ద చౌడేశ్వరీ కాలనీలో బస్టాపును ఏర్పాటుచేస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం వినతిపత్రాన్ని డీటీకి అందజేశారు. కార్యక్రమంలో గోపాల్‌యాదవ్, మైలారయాదవ్, ఆచారి, వడ్డె రామచంద్ర, ఓబులేస్‌యాదవ్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

వైసీపీ బీసీ సెల్ కార్యదర్శివర్గ సభ్యుడి మృతి



డీవీ రమణ (ఫైల్)

పరిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బెంగళూరు రామయ్య ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం వైసీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీవీ రమణ (56) మృతిచెందారు. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని రామయ్య ఆసుపత్రికి తరలించి చికిత్సలందిస్తుండగా మృతిచెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారుల, కుమార్తె ఉన్నారు.

రమేష్ కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

హిందూపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రొద్దం వ్యాయామ ఉపాధ్యాయుడు (పీఈటీ) రమేష్ కుటుంబానికి అండగా ఉంటామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పేర్కొన్నారు. ఇటీవల పీఈటీ రమేష్, ఆయన కుమార్తె రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో వారి చిత్రపటాలకు స్థానిక ఎంజీఎం పాఠశాలలో మంగళవారం పూల మాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఈటీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, నియోజకవర్గ అధ్యక్షుడు లోకనాథ్, ఎస్‌జీఎస్ సెక్రెటరీ మురార్జీయాదవ్, సరేష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకోండి: ఆర్డీఓ



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్

అగళి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు తమ సమస్యలను రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవాలని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్ కోరారు. అగళి మండల హెచ్‌డిహళ్లి గ్రామంలో మంగళవారం జరిగిన రెవెన్యూ గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సమస్యలు పరిష్కారం కోసం ప్రతి గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. గ్రామంలో రైతులు భూ సమస్యలను రెవెన్యూ సదస్సులో తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీటి భాగ్యలక్ష్మీ ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, స్థానిక సర్పంచ్ రామక్రిష్ణ, మండల సర్వేయర్ మారుతి పాల్గొన్నారు.

యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్య

పుట్టపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాదవ సంక్షేమ, అభివృద్ధి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నేత కేశవయ్యను ఎంపిక చేశారు. కూటమి ప్రభుత్వం పలు కార్పొరేషన్లకు మంగళవారం డైరెక్టర్లను నియమించింది. ఇందులో భాగంగా యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కేశవయ్యకు అవకాశం కల్పించింది.

ఆహారపదార్థాల్లో నాణ్యత పాటించాలి

చిలమత్తూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తినే ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తస్లీమా పేర్కొన్నారు. ఆమె మండల కేంద్రంలోని పలు హోటళ్లు, చికెన్ షాపులను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన చికెన్ మాత్రమే విక్రయించాలని, ఎట్టి పరిస్థితుల్లోను క్రితం రోజున కట్‌చేసిన చికన్ అమ్మరాదన్నారు. ఫ్రిజ్‌ల్లో పెట్టి విక్రయించరాదన్నారు. మాంసం విక్రయించే చోట ఈగలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎవరైనా నాణ్యత లేని మాసం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అనంతరం ఆమె హోటళ్లల్లో తనిఖీలు చేశారు. వంటకు ఏ నూనెలు వాడుతున్నారు. కల్తీ పదార్థాలతో వంట చేస్తే ప్రజలు అనారోగ్యం పాలవుతారన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

పాల రాక్షసులు





- తల్లీబిడ్డలకు అందించే పాలలో కక్కుర్తి
- కాంట్రాక్టరు జేబులోకి డబ్బులు
- అంగన్‌వాడీలకు పాలసరఫరాలో భారీ కోతలు
- నెలకు రూ.1.80లక్షలు స్వాహా!

హిందూపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి):ప్రతి చిన్నారి ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పాలు సక్రమంగా అందడంలేదు. పాల సరఫరాలో భారీగా కోతలు విధించి నోటి కాడ కూడు లాక్కొనే విధంగా కాంట్రాక్టర్లు తయరైనారు. వారికి స్థానిక సీడీపీఓలు వంత పాడుతున్నారు. లక్షలాది రూపాయలు ప్రతి నెలా మిగిలించుకొని నీకింత- నాకింత అనే విధంగా భాగాలు పంచుకుంటున్నారు. గత ప్రభుత్వంలో పౌష్టికాహారం సరిగా సరఫరా కాలేదు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎటువంటి లోటు లేకుండా పాలు, గుడ్లు, పౌష్టికాహారం అన్నీ సక్రమంగా అందించేలా చర్యలు చేపట్టారు. అయితే కొత్త కాంట్రాక్టర్లు ఆది నుంచే కొత్త దారులు వెతుక్కున్నారు. నయానో భయానో కొత్త దందాకు శ్రీకారం చుట్టారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్‌లకు సీడీపీఓ సపోర్టు లేకుండా ఎలా పాలు తక్కువగా సరఫరా చేస్తారని అనుమానాలు రేకెత్తుతున్నాయి. భారీగా ముడుపులు ముట్టడంతోనే గుట్టు చపుడుకాకుండా వ్యవహారం నడుస్తోందని ఆ సంస్థలోని వారే మాట్లాడుకోవడం విశేషం.

పాలు సక్రమంగా ఇవ్వక పోవడంతో అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలను లబ్ధిదారులు అడుగుతున్నారు. దీంతో వారు చేసేది లేక పక్క సెంటర్ల వారిని వేడుకుంటున్నారు. వారి గ్రూపుల్లో 'అక్కా! ఎవరి దగ్గరైనా పాలు అధికంగా ఉంటే మా సెంటర్‌కు సర్దుబాటు చేయండి. మరలా నెల నేను తిరిగి ఇస్తాను'. అని ఇలా మెసేజ్‌లు చేస్తున్నారు అంటే పరిస్థితి ఎలా తయారైందో అర్థం చేసుకోవచ్చు. అనంతపురం కాంట్రాక్టరు అయితే బాలయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతానికి ఒక్క లీటరు కూడా తక్కువ రాకూడదని సక్రమంగా సరఫరా చేస్తున్నాడు.

కాంట్రాక్టర్ల బెదిరింపు

హిందూపురంలో నూతనంగా కాంట్రాక్టు తీసుకున్న రఘునాయుడు, పాల వ్యాపారం చేసే నాగరాజు అనే వ్యక్తికి పాల సరఫరా చేసే అవకాశం ఇచ్చేశాడు. దీంతో అనుభవం ఉన్న ఆయన మొదటి నుంచే కోత విధిస్తూ వచ్చాడు. 'ఎందుకు ఒక బాక్సు తక్కువగా ఇస్తున్నారు?' అని కార్యకర్తలు అడిగితే 'మీ సీడీపీఓకు చెప్పాను సంతకం చేయండి' అని బెదిరించి మరీ సంతకాలు తీసుకున్నాడని అంగన్‌వాడీ కార్యకర్తలు వాపోతున్నారు.

కొన్ని సెంటర్లకు పాలు సరఫరానే చేయలేదని సమాచారం. ఒక్కో బాక్సులో 20 పాకెట్‌లు అంటే 10 లీటర్లు ఉంటాయి. ఈ లెక్కన సెంటర్‌కు ఒక బాక్సు సరఫరా చేయకపోయినా 330 సెంటర్లకు గాను 330 బాక్సులు మిగులుతాయి. బాక్స్‌కు పది లీటర్లచొప్పున 3300లీటర్లు కాజేస్తున్నారు. లీటరు రూ. 55 చొప్పున దాదాపుగా నెలకు రూ. 1.80లక్షలు స్వాహా చేస్తున్నారు. ఇవి గాక కొన్ని సెంటర్లకు అసలు పాలు అందడం లేదు. ఆ లెక్క అంతుచిక్కని విధంగా ఉంది. ఇలా నాలుగు నెలల నుంచి దాదాపు రూ.లక్షల్లో నొక్కేశారని ఆ ప్రాజెక్టు పరిధిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. దీంతో హిందూపురం అంగన్‌వాడీ ప్రాజెక్టులో భూకంపమే వచ్చినట్లు అయింది.

పై అధికారులకు సమాచారం అందించా



రెడ్డిరమణమ్మ, సీడీపీఓ

పాలు తక్కువగా అందిస్తున్నారనే సమాచారం ఉన్నతాధికారులకు తెలిపా. సూపర్‌వైజర్లు విజిట్ చేసి రికార్డులు పరిశీలించి, సమాచారం ఇవ్వాలి. సూపర్‌వైజర్లు నా దృష్టికి తీసుకురాలేదు. పాల సరఫరాదారులకు కూడా చెప్పా. ఆన్‌లైన్‌లో ఎంత చేశారో చూసి బిల్లు పెడుతాము.

నాకు ఫిర్యాదు రాలేదు



నాకు సీడీపీఓ నుంచి ఎటువంటి ఫిర్యాదు అందలేదు. నేరుగా సీడీపీఓలేఆన్‌లైన్‌లో చూపుతారు. మా వరకు సమాచారం రాలేదు. పై అధికారులకు చెప్పారన్నది వాస్తవం కాదు. **వరలక్ష్మి, పీడీ**

సీడీపీఓకు ఫిర్యాదు చేశాం: సూపర్‌వైజర్లు

అన్ని మండలాల్లో ఇలానే జరుగుతోందని సీడీపీఓకు ఫిర్యాదు చేశామని హిందూపురం, హిందూపురం రూరల్, లేపాక్షి, సూపర్‌వైజర్లు చెబుతున్నారు

సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమమే

- ఎన్‌ఎంయూ నాయకుల హెచ్చరిక



గ్యారేజీ గేటువద్ద ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయూ నాయకులు

హిందూపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హిందూపురం డిపోలో నెలకొన్న ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు హెచ్చరించారు. స్థానిక గ్యారేజ్ గేటు వద్ద మంగళవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారెడ్డి మాట్లాడుతూ హిందూపురం డిపో సమస్యల పుట్టగా ఉందన్నారు. పలు సమస్యలపై డిపో మేనేజర్ శ్రీకాంత్‌కు 4వ తేదీన డిఎంకు డిమాండ్‌లతో కూడిన వినతిని అందించామన్నారు. అయితే ఇప్పటి వరకు కనీసం వినతి మీద స్పందన లేదన్నారు. డ్రైవర్‌లపై కక్షసాధించు చర్యలు చేపట్టారన్నారు. హిందూపురం నెల్లూరు సర్వీసును ఒంగోలు వరకు పొడిగించి అధిక ఒత్తిడి తీసుకొస్తున్నారన్నారు. దీంతో డ్రైవర్‌లకు విశ్రాంతి కరువైందన్నారు. కావున ఒంగోలు లింకును తొలగించుకోవాలన్నారు. సంస్థకు ఆదాయ వనరులు సమకూరుస్తున్న హిందూపురం బెంగళూరు సర్వీసులను రద్దు చేశారన్నారు. అలా వాటిని రద్దు చేయడం వెనక మతలబు ఏంటని ప్రశ్నిస్తున్నారు. దీంతో కర్నాటక, బస్సులకు, ప్రైవేట్ బస్సులకు లబ్ధి చేకూరిందన్నారు. అదే విధంగా రద్దు చేసిన విజయవాడ, బళ్ళారి, బెంగళూరు, చెక్‌పోస్టు, తదితర సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. బుధవా రం కూడా సమస్యలపై ఎర్రబ్యాడ్జి ధరించి ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జోనల్‌కమిటీ మెంబర్ భారతి, రీజినల్ వైస్ ప్రెసిడెంట్ వలీసాబ్, డిపో కార్యదర్శి రంగనాథ్, డిపోచైర్మన్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దళితులకు భూపంపిణీ చేయండి

రొళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు, దళిత మహిళలు ఆర్ఐ మంజునాథ్‌కు రాష్ట్ర అధ్యక్షులు గంగరాజు నాయకత్వంలో వినతిపత్రం అందజేశారు. రొళ్ల మండలంలోని మిగులు భూమిలో దళిత నిరుపేద కుటుంబాలకు మూడు ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలని ఈసందర్భంగా డిమాండ్ చేశారు. నిరుపేదలైన వారికి వెంటనే భూమి, సౌకర్యం కల్పించాలని ఈసందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో మహిళలు తిప్పమ్మ, కెంచమ్మ, నరసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా పెట్రోల్ అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలి

గుడిబండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఎన్.పల్లి గ్రామ సమీపంలో ఉన్న పెట్రోల్ బంకు చుట్టుపక్కల గ్రామాల దుకాణాలలో అక్రమంగా పెట్రోల్, డీజిల్ అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కళ్యాణచక్రవర్తికి పెట్రోల్ బంకు డీలర్ తిప్పేస్వామి విన్నవించారు. మండలంలోని దుకాణాదారులు కర్ణాటక పెట్రోల్ బంకుల నుంచి పెట్రోల్, డీజిల్ తీసుకొచ్చి విక్రయిస్తున్నారని, దీంతో తమ పెట్రోల్ బంకుకు గండి పడడమేపాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లుతోందని, దీంతో అక్రమంగా డీజిల్, పెట్రోల్ అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గుడిబండ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐ చంద్రశేఖర్‌కు విన్నవించారు..

ఎస్.రాయాపురంలో ఘనంగా గౌరమ్మ పండుగ

గుడిబండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రాయాపురం గ్రామంలో మంగళవారం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా గౌరమ్మ పండుగను నిర్వహించారు. గౌరమ్మ పండుగ కార్యక్రమాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపంలోని కాటమరాయస్వామి దేవాలయం వద్ద అగ్గిమంటలు వేసి పశువులను ప్రత్యేకంగా అలంకరించి అగ్గిమంట చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఈకార్యక్రమంలో ప్రజలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత ఊరేగింపు



లేపాక్షి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత సత్తెమ్మ ఊరేగింపు కార్యక్రమాన్ని మామిడిమాకుల పల్లిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో వెలసిన సత్తెమ్మ దేవతను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ మూగజీవాలు ఆరోగ్యంగా ఉండాలని అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.

నర్సింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

పెనుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఓఎంసిఎపి, ఎస్‌ఎంకేర్ సంయుక్తంగా నిరుద్యోగ యువతీ యువకులకు జర్మనీభాషలో శిక్షణ ఇవ్వడంతోపాటు ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.కేశవరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు బీఎస్సీ నర్సింగ్ జీఎన్ఎం పూర్తి చేసి 35ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి తిరుపతిలో రెసిడెన్షియల్ డే స్కాలర్స్ విధానంలో జర్మనీ భాషపై ఆరునెలలపాటు నాలుగు దశల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ప్రాథమిక ఇంటర్వ్యూలో అర్హత సాధించిన వారికి జర్మనీలో ఉద్యోగాలు కల్పిస్తారని, ఆసక్తి ఉన్నవారు కోఆర్డినేటర్ శివప్రసాద్ 9676706976ను సంప్రదించవచ్చన్నారు.

గోమాంసం కేసులో ముగ్గురి బైండోవర్

గోరంట్ల, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : కర్నాటకు గోమాంసం తరలిస్తూ పట్టుబడిన బాగేపల్లి హైదర్‌అలీ, గోరంట్లకు చెందిన అన్వర్‌సాబ్, షేక్ అన్సర్‌ను తహసీల్దార్ మారుతి వద్ద మంగళవారం బైండోవర్ చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. కారులో నాలుగువందల కిలోల గోమాంసం తరలిస్తుండగా దాడిచేసి పట్టుకున్న విషయం తెలిసిందే. తహసీల్దార్ కార్యాలయంలో నిందితులను హాజరు పరగా, ఇంకపై ఎలాంటి నేరాలకు పాల్పకుండా సత్‌ప్రవర్తనతో ఉంటామని అంగీకరించడంతోపాటు రూ.రెండులక్షల సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. గోవులను వధించి మాంసం విక్రయం, రవాణాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి

పెనుకొండ రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారిపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త పార్వతమ్మపై అదే ఊరికి చెందిన రాజశేఖర్ మద్యం మత్తులో సోమవారం రాత్రి దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. కియ పోలీసు స్టేషన్ ఎస్ఐ రాజేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమ్మవారిపల్లిలో పార్వతమ్మ అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. సోమవారం రాత్రి ఆమె ఇంట్లోకి రాజశేఖర్ చొరబడి, వస్తువులన్నీ ధ్వంసం చేశాడు. అంతటితో ఆగకుండా ఆమెపై దాడి చేశాడు. దీనిపై పార్వతమ్మ పోలీసులను ఆశ్రయించారు. ఆ మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్‌వాడీ కార్యకర్తలు.. అమ్మవారిపల్లికి వెళ్లి పార్వతమ్మను పరామర్శించారు.

ద్విచక్రవాహన ప్రమాదంలో యువకుడికి గాయాలు

గోరంట్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం పంచాయతీ రాగిమేకలపల్లికి చెందిన వినోద్‌కుమార్ ద్విచక్రవాహన ప్రమాదంలో మంగళవారం తీవ్రంగా గాయపడ్డారు. నరసింహప్పకుమారుడు వినోద్‌కుమార్ ద్విచక్రవాహనంలో గోరంట్లకు వస్తుండగా చలమయ్య గారిపల్లి వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ఉన్నఫలంగా కుక్క అడ్డురావడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడగా వినోద్‌కుమార్ తలకు బలమైన గాయమైంది. వెంటనే గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం ప్రయివేటు వాహనంలో హిందూపురం తరలించారు.

సోలార్ విద్యుత్‌తో ఆదాయం



సోలార్ ఫలకాలను అమర్చిన విద్యుత్ అధికారులు

పరిగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆశయాల మేరకు మంగళవారం మొదటిసారిగా మండల కేంద్రంలోని తిరుమల లేఅవుట్‌లో నీటిపారుదలశాఖ అసిస్టెంట్ ఇంజనీర్ దివ్య ఇంటిపై 3కేవీ వాట్స్ సోలార్ ప్లాంట్‌ను ఏడీ జ్యోత్స్న ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జలవిద్యుత్ అధిక బిల్లుల పేరుతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి హర్‌ఘర్ సూర్య విద్యుత్ పథకంతో పేద ప్రజలు సోలార్ విద్యుత్‌ను వినియోగించుకుని మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించాలన్నారు. దానికి వినియోగదారుల ఖాతాలో నగదు జమచేస్తారన్నారు. ఈ పథకం కోసం రూ.2.20లక్షలు పెట్టుబడి పెడితే రూ.78వేలు సబ్సిడీ వినియోగదారులకు వస్తుందంటూఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వెండర్ రాజాఎంటర్‌ప్రైజెస్ రమేష్, పరిగి ఏఈ సంజీవప్ప, నోడల్ ఆఫీసర్ అబ్దుల్ పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత మలుగూరు

హిందూపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కడపజిల్లా గండి క్షేత్రంలో జరిగిన జోన్-4 క్రీడా పోటీల్లో వాలీబాల్ విభాగంలో మలుగూరు గురుకుల పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. ఈనెల 14నుంచి 3రోజులపాటు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో మలుగూరు గురుకుల పాఠశాలకు చెందిన క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. వీరిని మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్య



ఎరుకల నాగరాజు(ఫైల్)

హిందూపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యనారాయణపేటకు చెందిన ఎరుకల నాగరాజు(25)అనే యువకుడు ఇంట్లో పైకప్పుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ సీఐ అబ్దుల్‌కరీం తెలిపిన వివరాల మేరకు సత్యనారాయణపేటలో నివాసమున్న ఎరుకల నాగరాజుకు కొద్దిరోజుల క్రితం సర్జరీ అయింది. అయితే అప్పటి నుంచి ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెంది మంగళవారం తెల్లవారుజామున డోర్ కర్టన్‌తో ఇంటిపైకప్పుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గుర్తించి కిందకు దించి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువతి...

గుడిబండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేకాతి గ్రామానికి చెందిన శ్వేత(41) అనే వివాహిత ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకొన్నట్లు ఎస్‌హెచ్‌ఓ ప్రకాష్ తెలిపారు. విశ్వనాథ్ భార్య శ్వేతకు గత సంవత్సరం నుండి తరచూ కడుపునొప్పి వచ్చేది. ఎన్ని ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకొన్నా కడుపునొప్పి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఇంటిలో ఉన్న ఎలుకల మందును సేవించింది. కుటుంబ సభ్యులు మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.కోటితో సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

అగళి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అగళి మండల గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపినట్లు జడ్పీటీసీ ఉమేష్ పేర్కొన్నారు. అగళి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇప్పటికే ఉపాధిహామీ పథకం ద్వారా రూ.3కోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారని, మరో రూ.కోటి జిల్లాపరిషత్ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు. అగళి మండలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్ అభిజిత్, జిల్ల వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు రమేష్, రాజగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు

మడకశిర రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) రైతులు ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. మండలంలోని ఎఆర్ రొప్పం, ఆమిదాలగొంది పంచాయితీలలో రైతులు సాగుచేసిన పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు అనంతరం రైతులుతో సమావేశాన్ని ఏర్పాటుచేశారు. మొక్కజొన్న, పత్తి, రాగి. పంటలకు సోకే తెగుళ్ళ నివారణ ,తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో సిరికల్చర్ అధికారి ప్రతాప్ నాయక్, రైతు సేవా కేంద్ర సిబ్బంది మమత, హిమబిందు ప్రకృతి సేద్యం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మడకశిరటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా పట్టణంలోని పలు దేవాలయాల్లో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వడుసులమ్మ, గంగాభవాని, కొల్లాపురమ్మ, కన్యకాపరమేశ్వరీ ఆలయాలతో పాటు మారుతీనగర్‌లో వెలిసిన అభయ ఆంజనేయస్వామి ఆలయం, మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివార్లకు ఆకుపూజ అలంకరణ, విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో సైతం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా మారెమ్మ ఉత్సవాలు

మడకశిర రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లిలో మంగ ళవారం కనుమ మారెమ్మ, గౌడచంద్రమ్మ దేవతల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహిళలు జ్యోతులతో వచ్చి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామ సభలు

రొళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక బడ్జెట్ లేబల్‌సబ్జెట్ ఆధారంగా గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. ఈషెడ్యూల్ ప్రకారం 21వతేదీ బొమ్మగొండనహళ్లి, రత్నగిరి, హొట్టేబెట్ట, గుడ్డగుర్కి, కాకి, 22వతేదీ మల్లినమడుగు, ఎం.రాయాపురం, దొడ్డేరి, రొళ్లలో గ్రామసభలు నిర్వహిస్తారని, ఈసభలకు అనుబంధ శాఖల అధికారులు, రైతులు, రైతు కూలీలు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన

పెనుకొండ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రొద్దం మండలం శేషాపురం గ్రామంలో టింబక్టివ్ కలెక్టివ్ సహకారంతో ప్రతిభా వికలాంగుల సొసైటీ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు.